# మాయదారి మనసు

ప్రాయోజకులు

డా॥ వి. భూమయ్య
కార్యదర్శి

శ్రీ సరస్వతీ శిశు మందిరము
(ఉన్నత పాఠశాల)
సిద్ధిపేట - 502 103.

కాలయముడిలా కన్పించిన టెలిగ్రాం కవరు నోరు విప్పుతూంటే కమలాకర్ మాస్టారు కాళ్లూ చేతులు తేళ్లూ జెర్రులు పాకుతున్నట్టు వణికిపోతున్నాయి. సూర్యాస్తమయమప్పుడు పడమటి ఆకాశంలా మొహంలో రంగులు మారిపోతున్నాయి. కళ్లు అక్షరాల వెంట ఆత్రంగా పరుగెత్తుతున్నాయి.

జగదీశ్ ... డాక్టర్ జగదీశ్ అమెరికా నుండి హైద్రాబాదుకొస్తున్నాడు. అంతటి డాక్టర్ ఇంత షడెన్‌గా ఎందుకొస్తున్నట్టో ! ఎందుకేమిటీ ఇక్కడున్న అతని ఒకేఒక ఆస్తి ఈ ఇల్లు. ఇది కాస్తా అమ్ముకు పోతాడేమో ! ఔను అదే అయుంటుంది.

డాక్టర్ జగదీశ్ ఇల్లమ్మితే తానూ, తన కుటుంబము రోడ్డుమీద పడాల్సిందే. పోనీ ... ఈ ఇల్లు తానే కొనేస్తే ! అబ్బే ! తానో ఇల్లు కొనడమంటే ఊటచెలిమలో నౌకాయానం చెయ్యాలనుకోవడమే.

కాని... మరెలా ?

ముప్పయ్యేళ్ల బడిపంతులు ఉద్యోగంలో ముగ్గురు చెల్లెళ్ల పెళ్లిళ్లు చేసిన అనుభవం అప్పుల కుప్పల్ని కరిగిస్తూ పడక్కుర్చీలో కూచోమంది. జీవితానికి కనీసావసరాలైన కూడు, గుడ్డ గూడుల్లో మూడోది సాధించకముందే రిటైర్మెంట్ ముంచుకొచ్చింది. వచ్చిన గ్రాట్యుటీ గవ్వలు, పీయఫ్ చిల్లెర అప్పులకుప్పల్ని మాయం చేసేందుకు గువ్వల్లా ఎగిరిపోయినై. ఇహ వచ్చే పెన్షన్ రాళ్లతో భార్య విశాలాక్షమ్మ, తననే నమ్ముకున్న భారతి, జీవితాలు ముడిపడున్నాయి.

గత పాతికేళ్లనుండి ఈ ఇల్లు తనకెప్పుడూ అద్దె ఇల్లులాగన్పించలేదు. దానిక్కారణం దయామయి జగదీశ్ తల్లి పార్వతమ్మ. ఆవిడ బతికున్నన్ని రోజులు సొంత చెల్లిలా ఆదరించింది. అద్దె డబ్బులిమ్మని ఎప్పుడూ అడగలేదు. ఎప్పుడిచ్చినా, ఎంతిచ్చినా పుచ్చుకుంది. మరిప్పుడెలా ? ఏం చెయ్యాలి ? ... మాస్టారు బుర్రలో ఆలోచనల గుఱ్ఱాలు పరుగులు దీస్తున్నాయి.

కూచున్న పడక్కుర్చీ ముళ్లపాన్పులాగై పోయింది. భారతి అందించిన వేడివేడి కాఫీ గడగడా వెళ్లిపోయింది కడుపులోకి. ముక్కు మీద వేలేసుకుంది భారతి. టెలిగ్రాం చదివి చరచరా లోపలి కెళ్లింది.

మాస్టారు ఆలోచనలాగలేదు.

టెలిగ్రాం సంగతి భార్యకు తెలిసిపోతుంది. ఆమె ముందే బీ.పి. పేషంటు. అప్పుడప్పుడు ఛాతీనొప్పి గూడా సతాయిస్తుంది. ఇప్పు డే తుఫాను రాబోతుందో ఏమో ! భగవంతుడా నువ్వేదిక్కు భారమంతా పైవాడిమీద పడెయ్యడమే... అంతకు మించి మరేమీ తోచలేదు.

శివసాగర్, పార్వతమ్మల ఏకైక సంతానం జగదీశ్. హైస్కూల్లో అడుగుపెట్టగానే తండ్రిలేని వాడయ్యాడు. అప్పట్నుంచీ కమలాకర్ మాస్టారు కనుసన్నల్లో పెరిగాడు. యం.బి.బి.యస్., ఎం.ఎస్‌లో రాంకులు సాధించాడు. అమెరికాలో అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కోసం ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. అప్పుడు చూశాడు మాస్టారు కళ్లల్లో కదిలిన ఆనందాశ్రువుల్ని.

"గొప్ప డాక్టరుగా తిరిగొచ్చి గరీబులకు సేవలందించు నాయనా !" అంటూ ఆశీస్సులందించాడు గూడా.

మాస్టారు చిన్నప్పట్నుంచి నూరిపోసిన శ్రమ, పట్టుదల పాఠాలు పట్టుకొమ్మలైనాయి. గుండుసున్నా కాబోతున్న గుండెకాయను ఆపరేషన్ ద్వారా తొక్కుడు బండలా తయారు చేయగల నైపుణ్యం అబ్బింది. అదృష్టం అమెరికాలోనే అందలమెక్కించింది. ప్రపంచ ప్రఖ్యాత కార్డియాలజీ సర్జన్‌గా గుర్తింపు లభించింది. దశ తిరిగింది. అందుకే మాస్టారు ఉత్తరాలకు జవాబులివ్వడం అసాధ్యమైపోయింది.

కొడుకు క్షేమ సమాచారాలు తెలీక తల్లడిల్లిన తల్లి వెంటనే మన దేశానికి తిరిగిరమ్మని స్వయంగా ఉత్తరం రాసింది. ఆ ఉత్తరం గూడా ఉత్తుత్తి కబురుగా మారిపోయింది.

ఓ రోజు ఛాతీ నొప్పి భరించలేక పార్వతమ్మ గిలగిల్లాడిపోతుంది. ఒళ్లంతా చెమట పట్టేసింది. డాక్టర్ల పరీక్షల్లో అది గుండెనొప్పని తేలిపోయింది. మాస్టారు అంతరంగము అల్లకల్లోల సముద్రమైంది.

అభిమానాన్ని అణగదొక్కి టెలిగ్రామిచ్చాడు జగదీశ్‌కు.

"ఎంత ఖర్చైనా సరే ఓ స్పెషలిస్టు డాక్టరుకు చూపించండి" పాడి జవాబు పదివేల రూపాయల చెక్కుకు పిన్ చేసి వచ్చింది.

గుండె జబ్బుకు వైద్యముంటుంది గాని గుండె గాయానికి వైద్యం డబ్బుతో అయ్యేదా ? ఐనా ఈ మహానగరములో జగదీశ్ అంతటి సమర్థుడైన డాక్టరున్నాడా ? మాస్టారు మనసు ఘోషించింది.

"రెక్కలు కట్టుకు వస్తాడనుకున్న కొడుకు చెక్కుముక్కతో సరిపెట్టిండు. అడ్డాలనాడే బిడ్డలు గాని గెడ్డాలనాడు కాదు గదన్నయ్యా !" అంటూ పార్వతమ్మ కంటతడి బెట్టింది.

"లేదమ్మా! జగదీశ్ బుద్ధిమంతుడు. ఏదో బలమైన కారణముండుంటుంది." అని సముదాయించాల్సి వచ్చింది.

ఏ డాక్టర్ను సంప్రదించినా

"మీ కొడుకును మించిన డాక్టరిక్కడెవరున్నారండీ! ఓసారతన్నే పిలిపించుకోరాదూ!" ఉచిత సలహా పారేసి తోచిన వైద్యం చేశారు.

పదివేల రూపాయలు హారతి కర్పూరంలా కరిగిపోయినా పార్వతమ్మ జబ్బులో పిసరంతగూడా తేడా లేదు.

వాస్తవ పరిస్థితిని వివరిస్తూ పార్వతమ్మే సుదీర్ఘమైన ఉత్తరం రాసి పడేసింది. వెంటనే ఓసారి వచ్చి వెళ్లమని కన్నీటి అక్షరాలతో హెచ్చరించింది. కన్నీటి అక్షరాలు నీటిమీది రాతల ఫలితాన్నిచ్చాయి.

అసలు విషయానికి జవాబు లేదుగాని జగదీశ్ అసిస్టెంటు రాసిన జాబు ద్వారా తెలిసిందేమంటే - ప్రపంచ ప్రఖ్యాత కార్డియాలజీ సర్జనైన డాక్టర్ జగదీశ్ అమెరికన్ యూనివర్సిటీల్లో, అంతర్జాతీయ మహాసభల్లో ఉపన్యాసాలిస్తూ ఎన్నడూ లేనంత బిజీగా ఉన్నారనీ, తల్లిరాసిన ఉత్తరాన్ని గూడా చదువలేక పోతున్నందుకు విచారం వెలిబుచ్చారనీను.

శత్రు శిబిరంలో శతఘ్ని వాతపడ్డ సైనికుడిలా మాతృ హృదయం విలవిల్లాడింది. నొప్పి తీవ్రమైంది. ఒడ్డుకేసిన చేపలా తల్లడిల్లి పోతూ, కన్నకొడుకును తలుచుకుంటూ కన్నీరు మున్నీరై కన్నుమూసింది. తల్లి మరణవార్త తనయునికి టెలీఫోన్ ద్వారా వెళ్లింది.

ఎదిరిచూపుల్లో మూర్డోజులు మురిగిపోయినై. శవంకుళ్లిపోయింది. శవాన్ని వెంటనే లేపకపోతే మున్సిపాలిటీ కప్పగిస్తామన్నారు ఇరుగు పొరుగు జనాలు.

ఏజన్మ ఋణానుబంధమో - మాస్టారు చేతుల మీదుగా అంత్యక్రియలు జరిగాయి. తల్లిగాని తల్లికి తలకొరివి పెట్టిన మాస్టారు గుండె చెరువైపోయింది.

నాలుగోరోజు నిదానంగా దిగాడు జగదీశ్.

"కన్నతల్లి ఋణం తీర్చుకోలేకపోయాను మాస్టారూ!" అంటూ బావురుమన్నాడు. చేతిగుడ్డతో కళ్లద్దుకుంటూ వెక్కివెక్కి ఏడ్చాడు. విశాలాక్షమ్మకు తోలుబొమ్మలాట చూస్తున్నట్టు వింతగా తోచింది.

"అమ్మకంటే అమెరికా సంపాదనే గొప్పదైందా బాబూ? తల్లికి తలకొరివి పెట్టలేని తనయుడెందుకు నాయనా?" అని నిలదీయాలని ఉద్యుక్తురాలైంది, కాని మాస్టారు కళ్లసైగతో కోపమంతా గొంతులో బందీ అయింది.

కాలాన్నీ కడలికెరటాలనూ ఆపే శక్తి ఎవరకీ లేదుగదా! దశదిన కర్మ ముగిసింది. తల్లి ఫోటోతో తిరుగు ముఖం పట్టాడు జగదీశ్. వెళ్లేముందు

"కన్నతల్లికే అక్కరకు రాని ఈ కఠినాత్ముని క్షమించే వారెవరమ్మా?" అంటూ విశాలాక్షమ్మ ఒడిలో తలదాచుకుని కంట తడి బెట్టాడు. అదంతా కలనో మాయనో అర్థంగాలేదు.

"ఇది స్వయంకృతం జగదీశ్!" అంటున్న మాస్టారు గుండె బరువెక్కింది.

మే నెల ఎండలో తార్రోడ్డుమీద చెప్పులు లేకుండా నడుస్తున్నట్టనిపించింది జగదీశ్‌కు.

"అంటే .. మాస్టారూ ..!"

"ఔన్నాయనా! నీ చదువు పూర్తవగానే తిరిగొస్తే మీ అమ్మ మనకు దక్కేది గదా!"

"అమ్మ రోగము ఇంత ముదిరిందనుకోలేదు మాస్టారూ! అసలు పరిస్థితితో అమ్మరాసిన చివరి ఉత్తరం నాచేతికి ఆలస్యంగా అందింది. నిజానికి మీరు ఫోన్లో చావు వార్త చెప్పాకనే నా చేతికొచ్చిందా ఉత్తరం. కొద్దిరోజుల తర్వాత అమ్మను గూడా అక్కడికే తీసుకెల్దామనుకున్నాను గానీ ... ఇంత ఘోరం ... " పెదాలను పళ్లమధ్య బిగపట్టుకున్నాడు.

"నీలాంటి డాక్టరుకోసం ఈ దేశం ఎదిరిచూస్తోంది జగదీశ్!" మాస్టారు గొంతులో ఆవేశం, ఆవేదన.

"అనువుగాని చోట అధికులమనరాదు. మీ బోడి సలహా ఎవరిక్కాలండీ!" సన్నగా మందలించింది విశాలాక్షమ్మ.

డాక్టర్ జగదీశ్ ఝామ్మని విమానమెక్కి వెళ్లిపోయాడా రోజు. మరిప్పుడెందు కొస్తున్నట్టూ... అంతే ... ఇల్లుకోసమే.

"విమానాశ్రయం వెళ్లి జగదీశ్‌ను రిసీవ్ చేసుకుంటే బాగుండేదేమో !" పొద్దున్నే రావాల్సిన జగదీశ్ పొద్దు నెత్తిమీదికొచ్చాక గూడా రాకపోయేసరికి కమలాకర్ మాస్టారు కాలు గాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు.

"ఎందుకూ? వెంటనే ఇల్లమ్ముకుని మమ్మల్ని బయటికి గెంటేసి వెళ్లిపో నాయనా అనేందుకా?" చిటపట లాడింది విశాలక్ష్మమ్మ.

"అది కాదు విశాలాక్షీ! ..." ఏదో చెప్పాలనుకున్న మాస్టారు మాటలు పెదాలు దాటలేదు.

"ఎందుకమ్మా అంత భయం?" పెద్దవాళ్ల వాలకమసలే నచ్చలేదు భారతికి. "జగదీశ్ బాబు ఇల్లమ్ముకుంటే ఈ నగరంలో మనకో అద్దె కొంపనే దొరకదా? "

"అద్దె ఇల్లు దొరకదని కాదమ్మా! ఈ ఇంటితో పెంచుకున్న ఆత్మీయానురాగబంధాలు తెంచుకోలేక ... " విశాలాక్షమ్మ గుండెల్ని భయం మెలిపెట్టింది.

"జన్మనిచ్చి విద్యాబుద్ధులు నేర్పిన తల్లినీ, దేశాన్నీ మరచిన వాళ్లకు పుట్టిపెరిగిన పెంకుటిల్లు మీద పొంగుకొస్తుందా అభిమానం! ..." ఇంకేదో అనబోతున్న భారతి - మార్గమధ్యములో గమ్యాన్ని మరచిపోయిన బాటసారిలా ఆగిపోయింది. కనుబొమ్మలు ముడిపడినై.

"బాగున్నారా మాస్టారూ!" రానే వచ్చాడు డాక్టర్ జగదీశ్.

"ఈ ఇల్లు అమ్మడానికి వీల్లేదు!" అరవాలన్పించింది మాస్టారుకు.

"ఆహా నక్క వినయం. ఇహ ఈ ఇంటికీ మాకు ఋణం తీరిపోయింది" లోలోపల అనుకుంటూ ఉప్పెనెదుర్కోబోయె సముద్రతీరవాసిలా బక్క చచ్చిపోయింది విశాలాక్షమ్మ.

"మీ ఆరోగ్యమెట్లుందమ్మా?" అడిగాడు.

"ఎట్లా అఘోరిస్తే నీకేం?" అనాలన్పించింది. తమాయించుకుని "నా ఆరోగ్యానికేంగానీ నువ్వు బాగేనా బాబూ? పెళ్లెప్పుడు చేసుకుందామనుకుంటున్నావూ?" కూపీ లాగాలని ప్రయత్నించింది. బలవంతపు చిరునవ్వు పెదాల మీద మెరిసింది.

"ఔన్నాయనా ... నువ్వింకా పెళ్లి చేసుకోవా?" మాస్టారు తాళం వేశాడు.

"ఎందుకు చేసుకోనూ? తప్పకుండా చేస్కుంటా!"

ఐతే పెళ్లిచేసుకుని ఇల్లమ్ముకుని పెళ్లాంతో ఉడాయిస్తాడన్నమాట!

"పొద్దున్నే వస్తావనుకున్నాము బాబూ!"

"పొద్దున్నే వచ్చేశా మాస్టారూ!"

ఐతే రాగానే వేలందార్లను కలిసి ఇల్లు వేలం గురించి సంప్రదించుంటాడు.

"నేరుగా ఇక్కడికే రావాలనుకున్నాను గాని కొందరు మిత్రులు నా కోసమే కాచుక్కూచున్నారు. విమానం దిగ్గానే వెంటేసుకెళ్లారు". ఇల్లును నాలుగు మూలలా తడుముతున్నాయతని చూపులు. ఆ మాటల్ని జీర్ణించుకోవడం కష్టమైంది. మాస్టారు చూపులు భార్యవైపు మళ్లాయి.

"అలాగా ! చాలా గొప్పవాడివయ్యావు గదూ!" అందామె.

"ఏమోనమ్మా! వాళ్లందరి కళ్లు నామీదుంటే నా కళ్లు మీకోసం వెతికాయి."

ఛా ... పొరపాటైంది. చేబదులు చేసైనా రిసీవ్ చేసుకునేందుకెళ్తె బావుండేది... మాస్టారు మనసులో సర్కస్ ఫీట్లు.

"విమానాశ్రయం నుండి ఓ పారిశ్రామిక వేత్త ఇంటికి తీసుకెళ్లారు. వాళ్లమ్మాయి కుందనబ్బొమ్మలాగుంది. ఆమెను చూపించి పెళ్లి ప్రస్తావన తెచ్చారు - భోజనాలప్పుడు".

"నువ్వేమన్నావూ?"

"అక్కణ్నుంచి మరో కోటీశ్వరునింటికి. అక్కడా అదే తంతు."

"ఆడ పిల్లల తండ్రుల ఆరాటం బాబూఅది! అందం, ఐశ్వర్యం అన్నీ ఉన్న నీకు పిల్లనే కాదు. మోయలేనంత ముల్లె గూడా ఇస్తారు. ఇంతకీ నువ్వేమన్నావూ?" మాస్టారులో ఆసక్తి పెరిగింది.

"నేనేమీ అనలేదు. ముందీ ఇంటి విషయం తేల్చాలి."

కాఫీ అందిస్తున్న భారతి మెరుపు తీగలా కనబడింది. జగదీశ్ చూపులాపాదమస్తకం తడిమాయి.

"నమస్తే. నాపేరు భారతి." నమస్కరించింది.

సామనఛాయ, ముద్దబంతి మొహమ్మీద తీర్చి దిద్దిన కనుబొమ్మలు, సన్నజాజి ముక్కు. కళ్లలో కాంతిపుంజాలు. ఎగాదిగా చూస్తున్నాడు.

"ఈమె 'మా' అమ్మాయే బాబూ" 'మా' ఒత్తిపలికింది విశాలాక్షమ్మ.

"మీ అమ్మాయి సుకుమారికి పెళ్లైందిగదా!"

"మా అమ్మాయంటే" మాస్టారందుకున్నాడు. "అనాథ శరణాలయంలో పెరిగింది. చందాలిచ్చే దాతలు లేక శరణాలయాన్ని మూసేశారు. అందులోని అనాథల్ని కొందరం పంచేసుకున్నాం. ఈ భారతి మా కూతురైంది." మాస్టారు మాటల్లోని ఆత్మానందం జగదీశ్‌ను కదిలించింది.

"దీన్నో అయ్యచేతిలో పెడితే మా బాధ్యత తీరిపోతుంది. అప్పుడెక్కడున్నా కాలం గడిచిపోతుంది." విశాలాక్షమ్మ మహమ్మీద విశాదరేఖలు. "సరుకుల ధరలేమో చుక్కలనంటె. పెన్షన్ డబ్బులు ఇంటి కర్చులకే సరిపోయె. కట్నమిచ్చే తాహతు లేదాయే. పైగా ఇల్లు లేని వాళ్లంగద బాబూ!" ఎంత వద్దనుకున్నా వెటకారం తొంగి చూచింది.

మరిచిందేదో గుర్తుకొచ్చినట్టు జగదీశ్

"ఔనూ ... ఈ ఇల్లు విలువెంత ఉండొచ్చు మాస్టారూ ?" లోపీన అడిగాడు.

"ఓ లక్ష రూపాయలుండొచ్చు." కాలకూట విషాన్ని మింగుతున్నట్టు మాస్టారు కళ్లు గట్టిగా మూసుకుపోయి తెరుచుకున్నాయి.

నాల్గోరోజు డాక్టర్ జగదీశ్ -

"ఇల్లు పని పూర్తైంది మాస్టారూ!" అంటూ డాక్యుమెంట్సు మాస్టారు చేతికందించాడు. చేతులారా పెంచిన కొడుకుతో చెంపదెబ్బ తిన్నట్టనిపించింది వృద్ధదంపతులకు. మూడ్రోజుల క్రితం ఇల్లు కొలతలు వేస్తున్నప్పుడే వాళ్ల గుండెల్లో గుండ్రాయిలు దొర్లాయి. భారతిలో మొండి ధైర్యం మొలుచుకొచ్చింది. మొహం మబ్బుమాటు చందమామైంది.

"ఇంకేముంది. మనం వెంటనే వేరే ఇల్లు వెతుక్కోవాలి నాన్నా!" కర్తవ్యం గుర్తు చేసింది.

విశాలాక్షమ్మ ఛాతిలో సన్నని నొప్పి ప్రారంభమైందప్పుడే "ఇది నీ ఇల్లు, నీ ఇష్టం బాబూ! మధ్య మేమెవ్వరం?" కంఠంలో కాఠిన్యం. కళ్లల్లో మంచుతెరలు.

"డాక్టర్ జగదీశ్ చాలా ఎదిగిపోయాడు గదా! ఆయనకెందుకీ కొంపా?" పొత్తికడుపులోంచి పొంగుకొస్తున్న ఎసరును సంయమనం ఆపేస్తుంటే మాస్టారు చేతిలోని డాక్యుమెంట్సు రెక్కలు విప్పుకున్నాయి.

మాస్టారు దంపతుల వైఖరి అర్థం గాక జగదీశ్ చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోతున్నై. విశాలాక్షమ్మ గుండెల్లో గునపాలు దిగబడుతున్న బాధ. కాని పైకి మాత్రం గుంభనంగా ఉంది.

"అరె .. ఇవి ఇల్లమ్మిన కాయితాలు కావు" మసకబారిన మాస్టారి కళ్లు ఆశ్చర్యంతో విశాలమైనాయి. " ఇవి ఇన్సూరెన్సు డాక్యుమెంట్సు..."

"ఔను మాస్టారూ! మా అమ్మానాన్నల ఇల్లు నాకొక దేవాలయం లాంటిది. దీన్ని మూడు లక్షల కిన్సూర్ చేశాను." డాక్టర్ జగదీశ్ ఉత్సాహం ఉరుకులాడింది.

"ఏమిటి నాయనా నువ్వనేది?" విశాలాక్షమ్మ ఛాతీ మీదున్న బండరాయితొలగి పోయింది. తేలిగ్గా ఊపిరి పీల్చుకుని నోరెల్ల బెట్టింది.

"నిజమమ్మా! ఇప్పుడు మీరే నాకు దైవం చూపించిన తల్లిదండ్రులు. కన్నతల్లిని చేజేతులా పోగొట్టుకున్న నేను పెంచిన తల్లికి దూరంగా ఉండలేనిహ. ఇక్కడే ఓ నర్సింగ్ హోం ప్రారంభించి మిమ్మల్ని చూచుకుంటానని పూర్తిగా వచ్చానమ్మా. నాసామానంతా స్నేహితునింట్లో ఉంది." అంటున్న జగదీశ్ 'నిజంగా నేనుమట్టి తినలేదమ్మా' అంటూ యశోద ముందు నిల్చున్న బాలకృష్ణుడిలా కన్పించాడు.

"నాయనా జగదీశ్!" విభ్రాంతిలోంచి తేరుకున్న విశాలాక్షమ్మ కళ్లల్లో ఆనందాశ్రువులు.

"అయ్యో! ఈ పుత్తడి మనసును ఇత్తడనుకున్నామే!" మాస్టారు మనసు మూల్గింది. చూపులు భారతి వైపు మళ్లాయి.

ఒలంపిక్ గేమ్సులో స్వర్ణ పతకం సాధించినట్టు భారతి నరాల్లో సంతోషం ప్రవహించింది. చేసిన తప్పులను క్షమించుమన్నట్టు జగదీశ్ కళ్లలోకి చూచింది. జగదీశ్ గుండెల్లో తేనెజల్లు కురిసింది.

"నన్ను దీవించండి మాస్టారూ!" చేతులు మాస్టారి పాదాలను స్పృశించాయి. భుజాలు పట్టి లేపి గుండెలకు హత్తుకున్నాడు మాస్టారు. అనిర్వచనీయమైన ఆనందమది.

"డాక్టరుగారూ! ఇల్లు సంగతి తేలిపోయింది ఇహ తేలాల్సింది ఇల్లాలి సంగతే!" భారతి నవ్వింది. ఆ నవ్వు జగదీశ్ ఎదలో పూలజల్లైంది. చురుకైన చూపులు ఆవిడ బుగ్గల్ని తడిమాయి.

"మీరనుకుంటే అదెంతసేపూ! ఐనా ... మా అమ్మ కోడల్ని మెచ్చాలిగదా!" వెళ్లి విశాలాక్షమ్మ పాదాలవద్ద మోకరిల్లాడు.

"అంటే ... బాబూ! భారతంటే నీకిష్టమన్నమాట! ఆహా ... " విశాలాక్షమ్మ ఆనందం.

భారతి ముఖారవిందం వేయి రేకులుగా విప్పుకుంది. వెంటనే వెళ్లి జగదీశ్ పక్కనుండి విశాలాక్షమ్మ పాదాలకు నమస్కరించింది. ఇద్దరినీ లేపి చెరోవైపు గుండెలకు హత్తుకుందా తల్లి.

త్రివేణి సంగమమైన మూడు గుండెల్ని మనో దృష్టితో చూసిన మాస్టారు కళ్లు కృష్ణా గోదావరులైపోయినై.

**తేది : 2 - 12 - 1996 "ఆకాశవాణి" హైద్రాబాదు ప్రసారం.**